కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన పేరుతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అభయ హస్తం కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. అందులో భాగంగా ప్రజల నుంచి ఐదు పథకాలకు దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ముషీరాబాద్ నియోజకవర్గంలో 24 కేంద్రాలలో సందడిగా ప్రారంభమైంది.

ప్రజాపాలన దరఖాస్తులకు.. అనూహ్య స్పందన

- ప్రారంభించిన రెండు గంటలకే అయిపోయిన దరఖాస్తులు
- కాంగ్రెస్ నేతల హల్‌చల్, అంటీముట్టనట్లుగా ఎమ్మెల్యే
- బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య వాగ్వాదం
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు రాజకీయాలకు అతీతంగా పాల్గొనాలి: మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి


ముషీరాబాద్ వాలీబాల్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కోదండరెడ్డి, కార్పొరేటర్ సుప్రియనవీన్‌గౌడ్


దరఖాస్తు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ముఠా జైసింహ

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం ఉదయం 8 గంటల నుంచే ప్రజలు దరఖాస్తుల కోసం బారులు తీరారు. అంతకు ముందే జీహెచ్ఎంసీ సిబ్బంది తొక్కిసలాట జరగకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. మంచినీటి ఏర్పాట్లు, వికలాంగుల కోసం వీల్ చైర్‌లు ఏర్పాటు చేశారు. పోలీసు బందోబస్తు నియమించారు. ప్రతి కేంద్రానికి 250 దరఖాస్తులే ఇవ్వడంతో మొదటి రెండు గంటల్లోనే దరఖాస్తులు అయిపోవడంతో చాలా మంది ప్రజలు నిరాశగా వెనుతిరిగారు. మరికొన్ని దరఖాస్తు ఫారాలు తెచ్చినా అవి ఏమాత్రం సరిపోకపోవడంతో ప్రజలు జిరాక్స్ సెంటర్లను ఆశ్రయించారు.

- ఇదే అదనుగా భావించిన జిరాక్స్ సెంటర్ యజమానులు కలర్ జిరాక్స్ ఫారాలను రూ. 60కి, బ్లాక్ అండ్ వైట్ దరఖాస్తులను రూ. 30, రేషన్ కార్డు కోసం చేసుకునే దరఖాస్తుకు రూ. 20కు విక్రయించి సొమ్ము చేసుకున్నారు. జిరాక్స్ సెంటర్‌లు దరఖాస్తు దారులతో కిటకిటలాడాయి.

కాంగ్రెస్ నేతల హల్‌చల్...

అన్ని దరఖాస్తు కేంద్రాల వద్ద కాంగ్రెస్ పార్టీ నేతలు హల్‌చల్ చేశారు. మాజీ ఎమ్మెల్యే, సీనియర్ కాంగ్రెస్ నేత ఎం.కోదండరెడ్డి, జీఎస్ కేశవ్, అభిషేక్‌రెడ్డి తదితరులు అన్ని కేంద్రాలను తిరుగుతూ ప్రజల నుంచి ఎలాంటి స్పందన ఉందో పరిశీలించారు. దరఖాస్తులు వెంటనే అయిపోవడం పట్ల నోడల్ ఆఫీసర్, ఇన్‌చార్జీలతో మాట్లాడారు. ఏఐసీసీ ఫిషర్‌మెన్ సెల్ కార్యదర్శి బిజ్జి శత్రువు ఉచితంగా దరఖాస్తులను పంపిణీ చేశారు. అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షులు తిరుమల్, సీనియర్ కాంగ్రెస్ నేత పట్నం నాగభూషణంగౌడ్, పెండెం శ్రీనివాస్ యాదవ్‌లు ప్రజలకు దరఖాస్తులను నింపడంలో సహకరిస్తు సలహాలు, సూచనలను అందజేశారు.

- అంజన్‌కుమార్‌యాదవ్ కుమారుడు అరవింద్ యాదవ్ కూడా అన్ని కేంద్రాలు తిరుగుతూ పర్యవేక్షించారు.
- అయితే ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాత్రం నియోజకవర్గంలో పెద్దగా పర్యటించిన దాఖలాలు కనిపించలేదు. భోలక్‌పూర్‌లోని ఒక కేంద్రానికి వచ్చి వెళ్లినట్లు సమాచారం. ఆయన కుమారుడు ముఠా జైసింహ ముషీరాబాద్ వాలీబాల్ ప్లేగ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని పరిశీలించారు. ఆఫ్‌లైన్‌లో కాకుండా ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించాలని, ప్రతి సెంటర్‌లో కంప్యూటర్ ఏర్పాటు చేసి దరఖాస్తులను కంప్యూటర్‌లో నిక్షిప్తం చేయాలని సూచించారు. బీజేపీ కార్పొరేటర్లు సైతం అంతంత మాత్రంగానే కార్యక్రమంలో పాల్గొన్నారు. ముషీరాబాద్ డివిజన్ కార్పొరేటర్ సుప్రియనవీన్‌గౌడ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు అందించాలని, రేషన్ కార్డు లేనివారి దగ్గర కూడా దరఖాస్తు స్వీకరించాలని కోరారు.


కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంటున్న దృశ్యం

బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల వాగ్వాదం...

ముషీరాబాద్ డివిజన్‌లోని వాలీబాల్ ప్లేగ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన కేంద్రం వద్ద బీఆర్ఎస్ నాయకులు కూడా వచ్చి దరఖాస్తులను ప్రజలకు అందించడంలో సహకరించారు. ఈ క్రమంలో కొంతమంది బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ నేతలు దరఖాస్తు ఫారాలను 30 రూపాయలకు అమ్ముకుంటున్నారని ఆరోపణలు చేయడంతో అక్కడే ఉన్న కాంగ్రెస్ నేతలు పట్నం నాగభూషణంగౌడ్, జెనిగే శ్రీనివాస్‌యాదవ్ తదితరులు బీఆర్ఎస్ నేతలకు ఎదురు తిరిగి ప్రశ్నించారు. ఎవరు అమ్ముకున్నారో నిరూపించాలని గట్టిగా నిలదీయడంతో ఇరు పార్టీల నేతల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి–మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి.

ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బాధ్యతాయుతంగా వ్యహరిస్తు జనవరి 6వ తేదీ వరకు జరిగే ప్రజా పాలనలో స్వచ్ఛందంగా పాల్గొంటూ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలని ముషీరాబాద్ మాజీ ఎమ్మెల్యే, కిసాన్‌సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి కోరారు. పలు దరఖాస్తు కేంద్రాలను పర్యటించిన అనంతరం ఆయన మాట్లాడుతూ రాజకీయాలు వేరు, ప్రజా సేవా కార్యక్రమాలు వేరని తెలిపారు. ప్రభుత్వ పథకాలు పేదలకు న్యాయం చేసేవిగా ఉన్నప్పుడు వాటిని ప్రోత్సహించాల్సిన బాధ్యత రాజకీయాలకు అతీతంగా అందరిపై ఉందన్నారు. అంబర్‌పేట ఎమ్మెల్యే ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాన్ని గొడవ చేసి తప్పుదారి పట్టించేలా వ్యవహరించారని ఇది పద్ధతి కాదన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలు ప్రభుత్వ లోటుపాట్లను వెలికి తీసేలా ఉండాలన్నారు. కార్యక్రమంలో జీఎస్ కేశవ్, శ్రీరాముల యాదగిరి, అభిషేక్‌రెడ్డి, తేజాగౌడ్, పట్నం నాగభూషణంగౌడ్, జెనిగే శ్రీనివాస్‌యాదవ్, పెండెం శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల కొరతతో పరేషాన్



దరఖాస్తు కోసం ముషీరాబాద్ కేంద్రానికి వెళ్లగా అప్పటికే అయిపోయాయని చెప్పారు. నేను వృద్ధాప్య పింఛన్, ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని అనుకున్నారు. అయితే అందరు జిరాక్స్ సెంటర్‌లో దరఖాస్తులు దొరుకుతున్నాయని వెళ్లగా దరఖాస్తుకు రూ. 30, రేషన్ కార్డు దరఖాస్తు కోసం మరో రూ. 20 మొత్తం రూ. 50 ప్రకారం తీసుకున్నారు.
– ఆర్తి, ముషీరాబాద్

అంబర్‌పేట నియోజకవర్గం పరిధిలో...


నింబోలిఅడ్డలో దరఖాస్తులను అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్

అంబర్‌పేట్: ప్రజాపాలన కార్యక్రమం అంబర్‌పేట నియోజకవర్గం పరిధిలో గురువారం అట్టహాసంగా ప్రారంభమైంది. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గ్యారంటీల అమలుకు గురువారం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ప్రజల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. నియోజకవర్గంలోని 5 డివిజన్‌లలో ఏర్పాటు చేసిన 20 కేంద్రాల్లో దరఖాస్తులను అందించి పూర్తి చేసిన వాటిని అధికారులు స్వీకరించారు. కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్, బాగ్ అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మావెంకట్‌రెడ్డి అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్ పర్యవేక్షించారు. ప్రజాపాలన కార్యక్రమం ప్రారంభమైన గంటలోనే దరఖాస్తులు అయిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. జిరాక్స్ దరఖాస్తు చెల్లుబాటు అవుతుందనడంతో ప్రజాలంతా జిరాక్స్ దుకాణాల బాట పట్టారు. దరఖాస్తు ప్రక్రియ జనవరి 6వ తేదీ వరకు ఉందని ఎవరూ ఆందోళన చెందవద్దని అధికారులు భరోసా ఇచ్చారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కాచిగూడ: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందుతాయని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా గురువారం కాచిగూడ డివిజన్ నింబోలిఅడ్డలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ పాల్గొని అక్కడ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలకు దరఖాస్తు ఫారాలను ఎమ్మెల్యే అందజేశారు. ప్రజా పాలన కేంద్రాల వద్దకు వచ్చే ప్రజలకు దరఖాస్తు ఫారాలను అందుబాటులో ఉంచాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. దరఖాస్తులు పూర్తి స్థాయిలో అందుబాటులో లేకపోవడంతో ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తి మేరకు జిరాక్స్ దర ఖాస్తు ఫారాలను కూడా పరిగణలోకి తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లు కలుగకుండా ప్రజా పాలన కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలని అన్నారు. ప్రజాపాలన నింబోలి అడ్డ కేంద్రం ఇన్‌చార్జీ ప్రసాద్, ఎర్ర భీష్మదేవ్, దాత్రిక్ నాగేందర్ బాబ్జీ, ప్రతిభ, బల్‌వీర్, సూరి, బి.భీమ్ రాజ్, బాబు, ఎస్. రవియాద్, ఆర్.సంతోష్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

నల్లకుంటలో...


బాగ్ అంబర్‌పేటలో దరఖాస్తులు అందజేస్తున్న కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి


గోల్నాకలో ప్రజాపాలన కార్యక్రమంలో కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్

నల్లకుంట: నల్లకుంట డివిజన్ పరిధిలోని తిలక్‌నగర్ కమ్యూనిటీ హాల్, నర్సింహబస్తీ కమ్యూనిటీ హాల్, టీఆర్టీ కమ్యూనిటీ హాల్, అంబేడ్కర్ శతాబ్ది భవన్, సంజీవయ్య నగర్‌లలో ప్రజా పాలన కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు అన్ని సెంటర్లలో ఆరు గ్యారంటీ పథకాల దరఖాస్తులు అందుబాలో ఉంచడంలో జీహెచ్ఎంసీ అధికారులు విఫలమయ్యారు. దీంతో ఫారాలు అందుబాటులో లేకపోవడంతో పథకాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన ప్రజలు ఒకింత అసహనానికి గురయ్యారు. దరఖాస్తుల కోసం జనం ఇంటర్‌నెట్, జిరాక్స్ సెంటర్లకు పరుగులు తీశారు. నల్లకుంట పరిధిలోని ప్రజాపాలన కేంద్రాల వద్ద కాంగ్రెస్ కార్యకర్తలు స్థానిక బీజేపీ కార్పొరేటర్ అనుచరులు, బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రజలకు దరఖాస్తు చేసుకోవడంపై అవగాహన కల్పించారు. ప్రజా పాలన సెంటర్లను సందర్శించిన స్థానిక కార్పొరేటర్ అమృత దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. అలాగే అన్ని సెంటర్లలో ప్రజా పాలన ప్రక్రియను జీహెచ్ఎంసీ అంబర్‌పేట సర్కిల్ 16 డీసీ మారుతీ దివాకర్ పర్యవేక్షించారు.

జిరాక్స్ ప్రతితో దరఖాస్తు చేసుకోవచ్చు: డీసీ మారుతీదివాకర్

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన ఆరు గ్యారంటీ పథకాల కోసం దరఖాస్తుల ఫారాలు అందని వారు జిరాక్స్ ప్రతులతో కూడా దరఖాస్తు చేసుకోవచ్చని జీహెచ్ఎంసీ అంబర్‌పేట సర్కిల్–16 డీసీ మారుతీదివాకర్ సూచించారు. దరఖాస్తుల స్వీకరణ తొలిరోజు కొన్ని చోట్ల ఫారాల సరఫరాలో కొంత మేర లోపాలు జరిగాయన్నారు. శుక్రవారం నుంచి దరఖాస్తు ఫారాల కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎవరూ ఆందోళన చెందవద్దని అవసరమైన వారు జిరాక్స్ కాపీలు తీసుకుని దరఖాస్తు చేసుకోవచ్చని, జిరాక్స్ దరఖాసుల ఫారాలను తమ సిబ్బంది తీసుకుంటారన్నారు.


దరఖాస్తుదారులతో కిటకిటలాడుతున్న జిరాక్స్ సెంటర్


దరఖాస్తు ఫారాలను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నేత బిజ్జి శత్రువు


అంబర్‌పేట డివిజన్‌లో ప్రజాపాలన కార్యక్రమంలో కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్


నల్లకుంట ప్రజాపాలన సెంటర్‌లో దరఖాస్తుల స్వీకరణను పరిశీలిస్తున్న కార్పొరేటర్ అమృత

కాంగ్రెస్ పాలనలోనే ప్రజా సంక్షేమం


కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తున్న డాక్టర్ సింగిరెడ్డి రోహిణ్‌రెడ్డి, దిడ్డి రాంబాబు

కాచిగూడ: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు, అంబర్‌పేట నియోజకవర్గం ఇన్‌చార్జీ డాక్టర్ సింగిరెడ్డి రోహిణ్ రెడ్డి, జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం కాచిగూడ, లింగంపల్లి చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన పాలన అందించేందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజా పాలన ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు లక్ష్మణ్ యాదవ్, దేవిరెడ్డి విజితారెడ్డి, గరిగంటి రమేష్, తోట జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ ఐఏఎస్ అధికారులచే 'ఉచిత ఇంటర్వ్యూ, గైడెన్స్'

చిక్కడపల్లి: ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉన్నత సర్వీసులు సాధనే లక్ష్యంగా యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్‌లో మెయిన్స్‌లో ఉత్తీర్ణులై ఇంటర్వ్యూకు హాజరయ్యే విద్యార్థులకు అశోక్‌నగర్‌లోని శరత్‌చంద్ర ఐఏఎస్ అకాడమీ ఉచితంగా ఐఏఎస్, ఐపీఎస్ అధికారులచే మాక్ ఇంటర్వ్యూ, గైడెన్స్ అందిస్తోందని ఆ సంస్థ ఎండీ తోట శరత్‌చంద్ర తెలిపారు. ఇందులో భాగంగా మాజీ చీఫ్ సెక్రటరీ కె.ఎస్.కుమార్, మాజీ అదనపు డీజీపీ జీహెచ్‌పీ రాజు, అడిషనల్ డీజీపీ శంఖ బ్రతాలతో పాటు మరికొందరు ఆఫీసర్స్‌తో కలసి శరత్‌చంద్ర ఐఏఎస్ అకాడమీ విజయవాడ బెంజ్ సర్కిల్ బ్రాంచ్‌లో, ఈ నెల 30, అశోక్‌నగర్ బ్రాంచ్‌లో ఈ నెల 31న ఉచితంగా మాక్ ఇంటర్వ్యూలను, ఇంటర్వ్యూ గైడెన్స్‌లను నిర్వహించబోతున్నట్లు ఆయన వివరించారు. ఔత్సాహికులు ఫోన్: 94941 88688లో సంప్రదించాలని శరతచంద్ర ఐఏఎస్ అకాడమీ వెబ్‌సైట్‌లో ఉచితంగా లింక్ ద్వారా రిజిస్టర్ కావొచ్చునని తెలిపారు.

అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం


వికలాంగురాలికి వీల్ చైర్ అందజేస్తున్న డాక్టర్ రోహిణ్‌రెడ్డి

నల్లకుంట: అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ సి.రోహిణ్ రెడ్డి అన్నారు. టీపీసీసీ కార్యదర్శి ఎ.యాదగిరి జ్యోతి గౌడ్(లక్‌పతి) ఆధ్వర్యంలో గురువారం నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. దీనికి హాజరైన రోహిణ్ రెడ్డి ముందుగా కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించి ఓ వికలాంగురాలికి వీల్ చైర్ విరాళంగా అందజేశారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌యాదవ్, గ్రేటర్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు కె. గోవర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు దిడ్డి రాంబాబు, పులి జగన్, సీనియర్ నాయకులు గరిగంటి రమేష్, చాత్తాద రఘురామ్, యువజన కాంగ్రెస్ సీనియర్ నాయకులు జి. కిరణ్ సోనూ,సనిత్ కుమార్ పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

కాచిగూడ: ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించే దిశగా కృషి చేయడానికి శుక్రవారం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బర్కత్‌పుర డిపో మేనేజర్ ఎం.వేణుగోపాల్ తెలిపారు. ప్రజలు, ప్రయాణికులు తమ సమస్యలను ఫోన్: 90004 06069 ద్వారా తెలియజేయాలని కోరారు.

పేదల పక్షపాతి కాంగ్రెస్ పార్టీ


శివాలయం చౌరస్తా వద్ద కాంగ్రెస్ జెండాను ఆవిష్కరిస్తున్న స్వప్నాగౌడ్

ముషీరాబాద్: పేదల పక్షపాతి కాంగ్రెస్ పార్టీ అని కాంగ్రెస్ సేవాదళ్ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షులు స్వప్నాగౌడ్ అన్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ విర్భావ దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ ముషీరాబాద్ నియోజకవర్గం బీ బ్లాక్ కన్వీనర్ పట్నం నాగభూషణంగౌడ్ ఆధ్వర్యంలో గురువారం ముషీరాబాద్ శివాలయం చౌరస్తా వద్ద నిర్వహించిన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు స్వప్నాగౌడ్‌ముఖ్య అతిథిగా హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... ఇందిరమ్మ కన్న కలలను సీఎం రేవంత్‌రెడ్డి నేరవేర్చేలా పాలన కొనసాగిస్తున్నారన్నారు. ఇచ్చిన హామీలను నెలరోజుల్లోనే అమలు చేస్తూ రాష్ట్ర ప్రజలకు అండగా నిలిచారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ ఉపాధ్యక్షుడు లింగంగుప్తా, ముషీరాబాద్ నియోజకవర్గం బీ బ్లాక్ మహిళా కమిటీ అధ్యక్షురాలు అనురాధామురళీమోజెస్, ముషీరాబాద్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెండం శ్రీనివాస్‌యాదవ్, నేతలు రామానందరెడ్డి, సతీష్‌గౌడ్, కృష్ణవేణి, సదా తదితరులు పాల్గొన్నారు.

చిక్కడపల్లి శ్రీవారి ఆలయ హుండీ లెక్కింపు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నగరంలోని ప్రతిష్ఠాత్మకమైన చిక్కడపల్లిలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో గురువారం హుండీ లెక్కింపు జరిగింది. మూడు నెలలకు గానూ 25,93,373 రూపాయల ఆధాయం వచ్చినట్లు ఆలయ ఈవో రామాంజనేయులు, ఆలయ వ్యవస్థాపక వంశీయుడి కుమారుడు శ్రీనాథ్‌గౌడ్ తెలిపారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాధవి కుటుంబ సభ్యులు గురువారం శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ఈవో రామాంజనేయులు తెలిపారు.

అర్హులందరికీ రేషన్ కార్డులివ్వాలి


బాకారం పోచమ్మ గుడిలో పాల్గొన్న రాంనగర్ కార్పొరేటర్ రవిచారి

ముషీరాబాద్: అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు అందజేయాలని రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ కె.రవిచారి డిమాండ్ చేశారు. గురువారం ప్రారంభమైన ప్రజా పాలన కార్యక్రమంలో బాకారం పోచమ్మ దేవాలయంలో ఆయన పాల్గొని ప్రజలకు ఐదు పథకాల కోసం చేసుకునే దరఖాస్తుల్లో సహకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి కొత్త రేషన్ కార్డులను అందించలేదని దీంతో సగానికి పైగా పేదలు రేషన్ కార్డులు లేకుండా ఉన్నారని తెలిపారు. రేషన్ కార్డులు ఉన్న వారికి పథకాలను అందిస్తూనే రేషన్ కార్డులు లేని వారు సైతం దరఖాస్తు చేసుకునేలా అవకాశం కల్పించాలని ఆయన కోరారు.

డీసీపీ శరత్‌చంద్ర ఆకస్మిక పర్యటన

చిక్కడపల్లి: చిక్కడపల్లి ఏసీపీ, పీఎస్ కార్యాలయాలనుసెంట్రల్ జోన్ డీసీపీ శరత్ చంద్రపవార్ గురువారం రాత్రి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రధాన ప్రాంతాలు నగర కేంద్ర గ్రంథాలయం, పోటీ పరీక్షలు విద్యార్థులు, సినిమాహాల్స్, దర్శనీయస్థలాలు చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం, ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని శ్రీ లక్ష్మీగణపతి ఆలయం, వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయ ఆలయం, సుందర్యయ విజ్ఞానకేంద్రం, ఎంబీ భవన్, లేబర్ రాష్ట్ర కార్యాలయం, తూనికలు కొలతలు రాష్ట్ర కార్యాలయం, సివిల్స్, గ్రూప్స్ పరీక్షల కోచింగ్ సెంటర్‌లు, వీఐపీలు, తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ప్రజలకు సూచించారు. ఏసీపీ మధుమోహన్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సీతయ్యలను క్రైం వివరాలను, పోలీసుల పనితీరు, నూతన భవనం వివరాలను తెలుసుకున్నారు. అనంతరం దోమలగూడ పోలీస్ స్టేషన్ ఏసీపీ కార్యాలయం, పీఎస్‌ను సందర్శించారు. దోమలగూడ ఏసీపీ రవికుమార్, ఇన్‌స్పెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి, దోమలగూడ డీఐ, గాంధీనగర్ ఇన్‌చార్జీ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్, ఎస్‌లు పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ కృషి


పటేల్‌నగర్ చౌరస్తాలో కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకల్లో రోహిణ్‌రెడ్డి

అంబర్‌పేట్: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ పాటుపడుతుందని ఆ పార్టీ ఖైరతాబాద్ జిల్లా పీసీసీ అధ్యక్షులు రోహిణ్‌రెడ్డి తెలిపారు. గురువారం అంబర్‌పేట్‌లో పార్టీ శ్రేణులు నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం రోహిణ్‌రెడ్డి మాట్లాడుతూ... ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి విశేషంగా ఆదరించారని పేర్కొన్నారు. పార్టీపై ప్రజలు పెట్టుకున్న విశ్వాసాన్ని వామ్ము చేయకుండా వారి సంక్షేమానికి పాటుపడుతామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జ్ఞానేశ్వర్‌గౌడ్, దిడ్డి రాంబాబు, పులి జగన్, నాయకులు గరిగంటి రమేష్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రభుత్వ బడులను తద్వారా ప్రభుత్వ విద్యను బలోపేతం చేసి బడుగు, బలహీన వర్గాలకు నాణ్యమైన విద్యను అందించాలని ఎమ్మెల్సీ, తెలంగాణ పౌర స్పందన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ పౌర స్పందన వేదిక ఆధ్వర్యంలో ప్రభుత్వ బడులు నిలబడాలి–చదువుల్లో అంతరాయాలు పోవాలి అనే అంశంపై చర్చాగోష్టి నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ... దేశంలో, తెలంగాణ రాష్ట్రంలో విద్యలో అంతరాలు బాగా పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యలో వచ్చే వ్యత్యాసం సమాజంలోని అంతరాలను మరింతగా పెంచుతాయని ఇది సమాజానికి మంచిది కాదన్నారు. విద్యా విధానం మెరుగు పడాలంటే ప్రభుత్వ పాఠశాలలను వివిధ స్థాయిల్లో రీఆర్గనైజ్ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పౌర స్పందన వేదిక ప్రధాన కార్యదర్శి ఎం.రాధేశ్యామ్, రాష్ట్ర కమిటీ సభ్యులు కె.లక్ష్మణ్‌రావు, హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి.సమద్, సలహాదారులు డి.మస్తాన్‌రావు, మెడ్చల్ జిల్లా అధ్యక్షుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ స్వీపర్స్‌కు కనీస వేతనం రూ. 25 వేలు ఇవ్వాలి


కాచిగూడలో జీహెచ్ఎంసీ స్వీపర్స్‌కు దుస్తులు పంపిణీ చేస్తున్న కృష్ణ

కాచిగూడ: జీహెచ్ఎంసీలో స్వీపర్స్‌కు కనీసం వేతనం రూ. 25వేలు ఇవ్వాలని తెలంగాణ మున్సిపల్ స్వీపర్ అండ్ కామాటి వెల్ఫేర్ సొసైటీ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గాలిపల్లి కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ మున్సిపల్ స్వీపర్ అండ్ కామాటి వెల్ఫేర్ సొసైటీ యూనియన్ ఏర్పడి 1 సంవత్సరం పూర్తయిన సందర్భంగా యూనియన్ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమాన్ని గురువారం కాచిగూడలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వీపర్స్‌కు చీరలు, వారికి యూనియన్ గుర్తింపు కార్డులను ఆయన అందజేశారు. అనంతరం యూనియన్ అధ్యక్షురాలు పి.ఇందిరతో కలిసి ఆయన మాట్లాడుతూ... నిత్యం ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని రోడ్లను శుభ్రం చేస్తున్న స్వీపర్స్‌కు రక్షణ లేకుండా పోయిందని, విధి నిర్వహణలో ఎంతో మంది ప్రాణాలను సైతం కోల్పోయారని అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్వీపర్స్ అందిస్తున్న సేవలను గుర్తించి వారిని పర్మినెంట్ చేయాలని కోరారు.బి.లక్ష్మీ, జి.మల్లేష్, జి.కళావతి, హైమావతి, సరస్వతి, జి.వీరమ్మ, భాగ్యలక్ష్మీ, సాలీ నాయక్ పాల్గొన్నారు.

ఆంధ్రాబ్యాంక్ రిటైర్డ్ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం


మాట్లాడుతున్న అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణమూర్తి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆంధ్రా బ్యాంక్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు వారనాసి కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.ఎస్.రెడ్డి మాట్లాడుతూ... హైదరాబాద్ నగరంలో ఐదు వేల మంది అసోసియేషన్ సభ్యులు ఉన్నారన్నారు. వారి సమస్యలపై ప్రతి నెల చర్చించడం జరుగుతుందని తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ అప్‌డేషన్ చేయాలని, రిటైర్డ్ ఉద్యోగులకు బీమా పథకాన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగుల సమస్యలను అఖిల భారత స్థాయిలో కూడా చర్చించడం జరుగుతుందని తెలిపారు. అసోసియేషన్ సలహాదారు కె.వి.సుబ్బయ్య, డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎస్.వి.రమణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే రాష్ట్రాభివృద్ధి: ఎన్ఎస్‌యూఐ

చిక్కడపల్లి: కాంగ్రెస్ పాలనలోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్‌యాదవ్ అన్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ నేతలు మారిశెట్టి నర్సింగరావు, గుండు జగదీశ్‌బాబు ఆధ్వర్యంలో జవహర్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. అర్హులందరూ ఆరు గ్యారంటీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ నేతలు గుర్రం శంకర్, అభిషేక్ కెనడీ, గుర్రం చంద్రకళ, బి.కృష్ణయాదవ్, జయేందర్‌బాబు, యాదగిరిగౌడ్, శిషు కుమార్, ఆకాష్, గుండు సురేందర్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులు తొలగించాలి

ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో బెల్ట్‌షాపులను సమూలంగా తొలగించాలని ప్రగతిశీల యువజన సంఘం(పీవైఎల్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.ఎస్.ప్రదీప్, వి.అజయ్ డిమాండ్ చేశారు. గురువారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో పీవైఎల్ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. సమావేశం అనంతరం వారు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే బెల్ట్ షాపులను రద్దు చేస్తామని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారని దానిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మద్యం మత్తులో చేసే నేరాల సంఖ్య గణనీయంగా పెరుగుతోందన్నారు. పీవైఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈశ్వర్, రాకేష్, సహాయ కార్యదర్శులు ప్రతాప్, ఎం.రవికుమార్, కోశాధికారి వాసం బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.